క్లుప్తంగా

తహసీల్దార్‌కు వినతి

మరికల్: ఆర్టీసీ బస్టాండ్ ఎదుట ఉన్న సర్వేనంబర్ 1లోని ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలని అఖిల పక్షం నాయకులు బుధవారం తహసీల్దార్ సునితకు వినతిపత్రాన్ని అందజేశారు. మరికల్‌కు చెందిన కొందరు వ్యక్తులు ప్రభుత్వ స్థలంలో ఇంటి నిర్మాణంకోసం బోరు డ్రిల్ చేసిన విషయాన్ని వారు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అక్కడ రైతు బజార్ ఏర్పాటు చేసేందుకు తీర్మానం చేసిన అధికారులు ఇంటి నిర్మాణానికి ఎలా అనుమతులిచ్చారని, వెంటనే ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పనులు నిలిపివేయాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వీరన్న, హరిష్, రాజేష్, రామకృష్ణ, రాజు, రమేష్, బాల్‌రెడ్డి, ఆంజనేయులు, రవి, నరేష్ పాల్గొన్నారు.

జొన్నలు క్వింటా రూ.5,260

నారాయణపేట: స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో బుధవారం జొన్నలు క్వింటా గరిష్టంగా రూ.5,260, కనిష్టంగా రూ.4,036 ధరలు పలికాయి. అలాగే, వేరుశనగ గరిష్టంగా రూ.6,359, కనిష్టంగా రూ.5,810, ఎర్ర కందులు గరిష్టంగా రూ.10,311, కనిష్టంగా రూ.9,860, తెల్ల కందులు గరిష్టంగా రూ.10,589, కనిష్టంగా రూ.10 వేలు ధర పలికాయి.

క్రీడల్లో రాణించాలి

ధన్వాడ: విద్యార్థులు క్రీడాల్లో రాణించాలని బాలుర ఉన్నత పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం బాసన్న అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో విద్యార్థులకు బ్లాక్ స్థాయి క్రీడా పోటీలు నిర్వహించారు. వాలీబాల్, కబడ్డీ పోటీలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పీడీ నెల్సన్‌కుమార్, పీఈటీ సుకనకర్, వాలీంటర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటు

మాగనూర్: మండల పరిధిలోని వర్కూర్, అమ్మపల్లి ఇసుక రీచ్‌ల వద్ద కలెక్టర్ ఆదేశాల మేరకు బుధవారం సీసీ కెమెరాలను ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ సతీష్‌కుమార్ తెలిపారు. ఆయా గ్రామాల్లో ఆన్‌లైన్ అనుమతులతో నడుస్తున్న ఇసుక రవాణాలో ఎలాంటి అవినీతికి చోటుఇవ్వకుడదని ఉద్దేశంతోనే ఈ కెమెరాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

సమస్యను పరిష్కరిస్తాం

మద్దూరు: ఉపాధి హామీ పథకం పనులకు వెళ్లాలని కొత్తపల్లి మండలంలోని పెద్దతాండా ఉపాధి కూలీలకు ఎంపీడీఓ జయరాములు సూచించారు. గ్రామంలో ఉపాధి పనులకు కూలీలు రాకపోవడంతో ఉపాధి ఏపీఓ సిద్దేశ్వర్‌తో కలిసి కూలీలతో మాట్లాడారు.. గతంలో చేసిన పనులకు డబ్బులు రాక కూలీ వెళ్లడం లేదని ఎంపీడీఓ దృష్టికి తీసుకురాగా తమ సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

యువజన సదస్సుకు ఎంపికైన అయ్యప్ప

మరికల్: రష్యాలో జరిగే ప్రపంచ యువజన సదస్సుకు భారతదేశం తరపున మరికల్‌కు చెందిన న్యాయవాది అయ్యప్ప ఎంపికైయ్యారు. బుధవారం అయ్యప్ప విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 29నుంచి మార్చి 8వరకు రష్యాలో కొనసాగుతున్న ప్రపంచ యువజన సదస్సుకు అన్ని దేశాల నుంచి ఎంపిక చేయబడిన ప్రతినిధులు హాజరవుతారని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

కోస్గి: ద్విచక్ర వాహనంపై సొంతగ్రామానికి వెళ్తున్న ఓ వ్యక్తి ట్రాక్టర్ ఢీకొని తీవ్రంగా గాయపడిన సంఘటన పట్టణంలో బుధవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు మున్సిపల్ పరిధిలోని సంపల్లికి చెందిన మైబప్ప (38) వ్యక్తిగత పనుల నిమిత్తం కోస్గికి వచ్చి పనులు ముగించుకొని బైక్‌పై స్వగ్రామానికి బయలుదేరాడు. ఈ క్రమంలో తిమ్మాయపల్లి నుంచి కోస్గికి వస్తున్న ఓ ట్రాక్టర్ పట్టణ శివారులోని ఓ ఫంక్షన్‌హాల్ సమీపంలో బైక్‌ను ఢీకొట్టింది. దీంతో మైబప్ప తలపగిలి తీవ్రంగా గాయపడ్డాడు. అటుగా వెళ్తున్న కొందరు గమనించి స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో పాలమూరు జిల్లా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతిచెందాడు. ఈ సంఘటనపై దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బోయలకు బీజేపీ ఎంపీ టికెట్ ఇవ్వాలి

మరికల్: పాలమూరు పార్లమెంట్ నియోజకవర్గంలో అత్యధిక శాతం ఉన్న బోయలకు బీజేపీ పార్టీ ఎంపీ టికెట్ కేటాయించాలని రాష్ట్ర జేఏసీ రాష్ట్ర నాయకులు గద్వాల్ రాములు అన్నారు. బుధవా రం మండలంలోని ఏర్పాటు చేసిన వాల్మీకి సంఘం నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు. పాలమూరు పార్లమెంట్ నియోజకవర్గంలో 54శాతం ఉన్న బీసీలకు కాదని బీజేపీ ఎంపీ అగ్రవర్ణాలకు టిక్కెట్ ఇవ్వొద్దన్నారు. బీసీలోని వాల్మీకులకు ఎంపీ టికెట్ కేటాయిస్తే ముందుండి గెలిపించుకునే బాధ్యత తమపై ఉంటుందన్నారు. ఎర్ర నర్సింహులు, బోయ సతీష్, నర్సింహులు, రాచాల శ్రీనివాసులు, రాములు, తిరుపతయ్య, ఆనంద్, మోహన్ పాల్గొన్నారు.

ఓబీసీ మోర్చ జిల్లా ప్రధాన కార్యదర్శిగా శ్రీరాం

బీజేపీ ఓబీసీ మోర్చ జిల్లా ప్రధాన కా ర్యదర్శిగా ఎలిగండ్లకు చెందిన వడ్డె శ్రీరాంను బుధవారం ఎన్నుకున్నారు. ఆయన మాట్లాడు తూ రాబోయే పార్లమెంట్ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని జిల్లాలో పార్టీన్ని బలోపేతం చేసేందుకు తమవంతు కృషి చేస్తామన్నారు.


నారాయణపేట గురుకుల స్కూల్లో..


నర్వలో..


ఊట్కూర్‌లో ..

ఘనంగా సైన్స్ డే వేడుకలు


నారాయణపేటలో సీవీ రామన్ చిత్రటానికి నివాళులర్పిస్తున్న డీఈఓ ఎండీ అబ్దుల్ ఘనీ

నారాయణపేట రూరల్: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలో బుధవారం సైన్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానిక డీఈఓ కార్యాలయంలో డీఈఓ ఎండీ అబ్దుల్ ఘనీ, మైనార్టీ గురుకుల స్కూల్‌లో మైనార్టీ వెల్ఫేర్ అధికారి ఎంఏ రషీద్ సీవీరామన్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ సైన్స్‌ను సద్వినియోగం చేసుకుంటే లాభాలు ఉన్నాయని, దుర్వినియోగం చేస్తే నష్టపోతామని చెప్పారు. సీవీ రామన్ గొప్పతనాన్ని వివరించారు. అదేవిధంగా సైన్స్ రంగోలీ, వివిధ రకాలైన ప్రయోగాలు ప్రదర్శించడంతో పాటు క్విజ్ తదితర కార్యక్రమాలు నిర్వహించి, సైన్స్ టీచర్లను సన్మానించారు. ఆయా కార్యక్రమాల్లో సెక్టోరియల్ అధికారులు విద్యాసాగర్, శ్రీనివాస్, నాగార్జున్‌రెడ్డి, సీఎస్‌ఆర్ డీసీ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ నారాయణగౌడ్, డీఎస్‌ఓ భానుప్రకాష్, సైన్స్‌ఫోరం కన్వీనర్ కనకప్ప, మహే ష్, శశికళ, ప్రిన్సిపాల్స్ ఖవాజా మహబూబ్‌ఖాన్, దత్తుచౌద్రి, వేణుగోపాల్, సైన్స్ టీచర్లు పాల్గొన్నారు.

మక్తల్: ప్రతి విద్యార్థి సొంత ఆలోచనను పెంచుకోవాలని ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. బుధవారం సైన్స్ దినోత్సవం సందర్భంగా పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. మంతన్‌గోడ్ పాఠశాలలో విద్యార్థులకు సైన్స్ పరికరాలను తయారు చేసి అవగాహన కల్పించారు. పోటీలో గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో బీకేఆర్ చైర్మన్ బాలకృష్ణారెడ్డి, గోపాల్‌రెడ్డి, ధర్మరాజు, లక్ష్మణ్, ప్రిన్సిపాల్ రాములు, జీహెచ్‌ఎం అనిల్‌గౌడ్, ప్రకాష్, వెంకట్‌రాములు పాల్గొన్నారు.

ఊట్కూరు: సైన్స్ దినోత్సవం సందర్భంగా గీతాంజలి పాఠశాల, నిడుగుర్తి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులచే చేపట్టిన విజ్ఞాన ప్రదర్శన చూపరులను ఆకట్టుకుంది. నిడుగుర్తి పాఠశాలలో డీఈఓ అబ్దుల్ ఘనీ విజ్ఞాన ప్రదర్శనను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల స్థాయిలో విజ్ఞాన ప్రదర్శన కార్యక్రమం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. విద్యార్థులు చిన్నప్పటి నుంచే సైన్స్‌పై ఆసక్తి పెంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ వెంకటయ్య, ఏఎంఓ విద్యాసాగర్, హెచ్‌ఎం లక్ష్మారెడ్డి, జిల్లా సైన్స్ అధికారి భానుప్రసాద్, డీఆర్‌బీ శ్రీకాంత్, చంద్రశేఖర్‌రెడ్డి, పద్మ, సునీత తదితరులు పాల్గొన్నారు.

మాగనూర్: మండలంలోని ఆయా పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వాహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తమ పాఠ్యాంశంలోని అంశాలను ప్రదర్శించారు. అంతకుముందు సీవి రామన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నర్వ: విద్యార్థులు సైన్స్‌పై ఆసక్తికనబర్చి శాస్త్రీయ దృక్పతాన్ని పెంపొందించుకోవాలని హెచ్‌ఎం మల్లేష్ అన్నారు. బుధవారం సైన్స్ దినోత్సవాన్ని మండలంలోని ఆయా పాఠశాలలో నిర్వహించారు. అనంతరం సర్ సీవిరామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన ప్రతిభా పోటీలలో విజేతలైన వారికి బహుమతులు అందజేశారు. ఉపాధ్యాయులు నాగలక్ష్మీ, రాజేష్, కురుమూర్తి పాల్గొన్నారు.

ధన్వాడ: సైన్స్‌డే సందర్భంగా బుధవారం మండల కేంద్రంలోని క్రాంతి విద్యాలయం, శ్రీసాయి సరస్వతీ విద్యాలయంలో విద్యార్థులు సైన్స్ సంబంధించి ప్రయోగాలను తయారుచేసి వాటి ఉపయోగాలను వివరించారు. ముఖ్యఅతిథిగా వచ్చిన ఏఎస్‌ఐ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. శాస్త్రసాంకేతిక పరిజ్ఞానాన్ని అలవర్చుకోవాలని చిన్నప్పటి నుంచే సైన్స్‌పై అవగాహన కలిగి ఉండేలా చూడాలన్నారు.

కోస్గి: మండలంలోని ముశ్రీఫా జెడ్పీ ఉన్నత పాఠశాల, బోగారం ఉన్నత పాఠశాలలో బుధవారం విద్యార్థులచే సైన్స్ ఫెయిర్ నిర్వహించారు. ఈ మేరకు.. హెచ్‌ఎం పుల్లప్ప ఈ ప్రదర్శన సందర్భంగా మాట్లాడుతూ.. విజ్ఞాన ప్రదర్శన ద్వారా విద్యార్థుల ప్రేరణ పొంది వారిలోని సృజనాత్మకతను వెలికితీసే అవకాశం ఉంటుందన్నారు. పరిజ్ఞానాన్ని విస్తృత పరచడంలో ప్రత్యక్షపరిశీలన, అనుభవాలు ఎంతో తోడ్పతాయని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులకు చిత్రలేఖనం, ఉపన్యాసం, కవితాగానం, పోటీలు నిర్వహించారు. కార్యక్రమాల్లో హెచ్‌ఎం సత్యనారాయణ, సైన్స్ ఉపాధ్యాయులు భానుకుమారి, స్వప్న, గిరిజ, సాయప్ప, నవీన్, నగేష్, ఉపేందర్, మల్లేశం, శ్రీదేవి, మాధవరెడ్డి, రాజశేఖర్, ఆంజనేయులు పాల్గొన్నారు.

మరికల్: సైన్స్ దినోత్సవం సందర్భంగా వరంగల్‌లో బుధవారం జరిగిన కార్యక్రమంలో తీలేర్ విద్యార్థిని బుజ్జమ్మ ప్రతిభ చాటడంతో అక్కడి ప్రముఖులతో జాతీయ సైన్స్ అవార్డును అందుకున్నట్లు హెచ్‌ఎం అనురాధ తెలిపారు. తెలంగాణ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఆధ్వర్యంలో నిర్వహించిన సైన్స్‌పాటల పోటీలో రాష్ట్రస్థాయి ప్రథమ బహుమతి గెలుపొందిన బుజ్జమ్మ జాతీయ అవార్డును కైవసం చేసుకోవడం పాఠశాలకు గర్వకారణమన్నారు.


మరికల్‌లో..


మక్తల్‌లో..


మాగనూర్‌లో..


కోస్గిలో విజ్ఞాన ప్రదర్శన పాల్గొన్న విద్యార్థులు

ఇంటర్ పరీక్షలు ప్రారంభం


నారాయణపేట గురుకుల పరీక్ష కేంద్రం వద్ద బందోబస్తు పరిశీలిస్తున్న ఎస్‌ఐ

నారాయణపేట రూరల్: జిల్లాలో ఇంటర్ పరీక్షలు ప్రశాంత వాతావరణంలో ప్రారంభం అయ్యాయి. తొలిరోజు బుధవారం ప్రథమ సంవత్సరం విద్యార్థులకు సెకండ్ లాంగ్వేజ్ పరీక్ష నిర్వహించగా.. 95.04హాజరుశాతం నమోదైంది. జిల్లా వ్యాప్తంగా 3981 మంది రెగ్యులర్ విద్యార్థులకు 3803మంది హాజరుకాగా 178మంది విద్యార్థులు గైర్హాజరు అయ్యారు. అదేవిధంగా 589మంది ఒకేషనల్ విద్యార్థులకు 559మంది పరీక్ష రాయగా 30మంది గైర్హాజర్ అయ్యారు. పరీక్ష కేంద్రాల్లో ఎక్కడా సమస్యలు లేకుండా అవసరమైన వసతులు కల్పించారు. నిమిషం నిబంధనతో విద్యార్థులు గంట ముందే కేంద్రానికి చేరుకోగా, చివరి క్షణాల్లో కొందరు ఉరుకులు పరుగులు పెట్టడం కనిపించింది. కేంద్రాల పరిసరాల్లో 144 సెక్షన్‌తో పాటు జిరాక్స్ దుకాణాలు మూసి వేశారు. పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. పూర్తిగా నిఘా నీడలో పరీక్షను పూర్తిచేశారు. కేజీబీవీ, వివిధ గురుకుల విద్యార్థులు తమ పరీక్ష కేంద్రాలకు వెళ్లడానికి ఆర్టీసీ బస్సుతో పాటు ప్రైవేటు వాహనాలను ఏర్పాటు చేశారు. జిల్లా తనిఖీ బృందం అధికారులు మద్దూర్, దామరగిద్ద, నారాయణపేటలో పర్యటించగా, ఫ్లయింగ్ స్కాడ్ బృందం మక్తల్ కేంద్రాలు, సిట్టింగ్ స్కాడ్ మరికల్, కోస్గి కేంద్రాలు పరిశీలించారు.

మద్దూరు: మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ పరీక్షలు బుధవారం ప్రారంభమైయ్యాయి. మొదటి సంవత్సరం తెలుగు పేపర్–1కు 237మంది హాజరుకావాల్సి ఉండగా 219 మంది విద్యార్థులు హాజరైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ మద్దిలేటి తెలిపారు. 18 మంది విద్యార్థులు గైర్హజరైయ్యారు. ఈ పరీక్ష కేంద్రానికి డీఈసీ కన్వీనర్ సుదర్శన్‌రావు కమిటీ సభ్యులు ప్రతాప్‌రెడ్డి పరీక్ష కేంద్రాన్ని పరిశీలించినట్లు ఆయన పేర్కొన్నారు.

మక్తల్: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ పరీక్షలు బుధవారం ప్రశాంతంగా కొనసాగాయి. పట్టణంలోని మూడు కేంద్రాల్లో 965మంది హాజరు కాగా, 32మంది విద్యార్థులు గైర్హజరైయ్యారు. ఎస్‌ఐ వైవీ లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో పరీక్ష కేంద్రాల వద్ద పోలీస్ బందోబస్తు ఏర్పాటుచేశారు.

మాగనూర్: ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు బుధవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రశాంతంగా జరిగినట్లు సీఎస్ రామస్వామి తెలిపారు. మొదటి రోజు 171మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా, 166మంది పరీక్ష రాశారు. 5ఐదుగురు గైర్హాజరయ్యారు.

పెండింగ్ కేసుల సత్వర పరిష్కారానికి కృషి


మాట్లాడుతున్న ఎస్పీ యోగేష్‌గౌతమ్

నారాయణపేట రూరల్: ప్రతీ కేసును క్షుణంగా పరిశీలించి వేగంగా పరిష్కరించేందుకు ఎస్‌హెచ్‌ఓలు కృషిచేయాలని ఎస్పీ యోగేష్‌గౌతమ్ సూచించారు. స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లాలోని సీఐ, ఎస్‌లతో బుధవారం నిర్వహించిన నేర సమీక్ష సమావేశంలో ఎస్పీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోలీసు స్టేషన్ల వారీగా పెండింగ్ కేసుల వివరాలు, ఆలస్యానికి కారణాలను అడిగి తెలుసుకున్నారు. కేసుకు సంబంధించిన ప్రతి ఆధారాన్ని సంపాదించి, నేరస్తులకు కోర్టు ద్వారా తగిన శిక్ష పడే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కేసులకు సంబంధించి ప్రతీది ఆన్‌లైన్ చేయాలని, నేరాల కట్టడికి అవసరమైన నివారణ చర్యలు చేపట్టాలన్నారు. సైబర్ నేరాల భారిన పడకుండా యువత, గ్రామీణ ప్రజలకు తగిన అవగాహన కల్పించాలని, డయల్ 100 ఫిర్యాదులను వెంటనే స్పందించి పరిష్కరించాలన్నారు. పెట్రోలింగ్ విషయంలో నిర్లక్ష్యం లేకుండా చూడాలని, నిషేధిత వస్తువుల విక్రయాలపై దృష్టి సారించాలని, 5ఎస్ అమలుకు తగిన సూచనలు చేస్తూ పీఎస్ పరిశుభ్రత, ఫైల్స్ క్రమ పద్ధతిలో ఏర్పాటు చేసే విధంగా కిందిస్థాయి సిబ్బందికి సూచనలు చేయాలన్నారు. పీఎస్‌కు వచ్చే బాధితులకు భయం పోగొట్టి భరోసా అందించాలని, ప్రతి ఒక్కరితో మర్యాదగా నడుచుకోవాలన్నారు. మహిళల రక్షణ, దొంగతనా ల నివారణా చర్యలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. డీఎస్పీలు లింగయ్య, మహేష్, సీఐలు భగవంత్‌రెడ్డి, చంద్రశేఖర్, రాజేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

బీజేపీ మోర్చాలను బలోపేతం చేద్దాం

నారాయణపేట రూరల్: పార్లమెంట్ ఎన్నికలే లక్ష్యంగా పనిచేస్తూ బీజేపీ మోర్చాలను బలోపేతం చేద్దామని ఆ పార్టీ రాష్ట్ర నాయకులు కొత్తకాపు రతంగపాండురెడ్డి అన్నారు. జిల్లా పార్టీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పార్టీ పటిష్టతకు నిబద్ధతతో కార్యకర్త పనిచేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలో ప్రజలకు చేర్చాలన్నారు. జిల్లా అధ్యక్షుడు పి.శ్రీనివాసులు, శ్రీనివాస్‌గౌడ్, రఘురామయ్యగౌడ్, జీకే నర్సింహులు పాల్గొన్నారు.

శ్రీశైలానికి శివస్వాముల పాదయాత్ర

నారాయణపేట రూరల్: పట్టణంలోని అమరేశ్వర స్వామి ఆలయం నుంచి 40మంది శివమాలాధారులు పాదయాత్రగా బుధవారం శ్రీశైలం బయలుదేరి వెళ్లారు. ఉదయం ఆలయంలో స్వామివారికి పంచామృతాభిషేకం, బిల్వార్చన, మహామంగళ హారతి కార్యక్రమాలు నిర్వహించారు. వీరికి పలువురు బాజాభజంత్రీలు, మంగళహారతులతో ఊరేగింపుగా వెళ్లి వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో గోపాల్‌రెడ్డి, జానీ, మల్లప్ప పాల్గొన్నారు.

మద్దూరు: మండలంలోని శివమాల ధారణ చేసిన స్వాములు పాదయాత్రగా శ్రీశైలానికి బుధవారం బయలుదేరి వెళ్లారు.అనంతరం ఆలయంలో పూజలు నిర్వహించి స్వాములను సాగనంపారు.

ధన్వాడ: మండల కేంద్రంలోని శివ మాలధారులు బుధవారం శ్రీశైలానికి తరలివెళ్లారు. ఆలయంలో ఇడుముడులు కట్టుకుని ప్రధాన వీధుల గుండా ర్యాలీగా బస్‌స్టాండ్ వరకు చేరుకుని అక్కడి నుంచి వాహనాల్లో బయలుదేరి వెళ్లారు.

కృష్ణా: మండలంలోని తంగిడికి చెందిన శివస్వాములు బుధవారం ఇరుముడి కట్టుకుని శ్రీశైలానికి పాదయాత్రగా బయలు దేరి వెళ్లారు. అంతకుముందు గ్రామంలోని శివాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు, గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.


పకడ్బందీగా అమలు చేయాలి

మరికల్: ప్రభుత్వం అమలు చేస్తున్న ఎఫ్‌ఎల్‌ఎన్ పకడ్బందీగా అమలు చేసేందుకు ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని నోడల్ అధికారిణి మనోరంజని అన్నారు. మండలంలోని ఎక్లాస్‌పూర్ ప్రాథమిక పాఠశాలను బుధవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు 30రోజుల యక్షన్ ప్లాన్ సిలబస్‌పై శ్రద్ధతీసుకోవాలని సూచించారు. అనంతరం ఉపాధ్యాయులతో కలిసి ఆమె నిలువు రాళ్ల మాస పత్రిక ఆవిష్కరణ చేశారు. హెచ్‌ఎం దత్తాత్రీ, లక్ష్మీ, సీఆర్పీలు శివకుమార్, అరుణ పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

కృష్ణా: మండలంలోని ముడుమాల్, మురహర్‌దొడ్డి గ్రామాలకు చెందిన నాలుగు ఇసుక ట్రాక్టర్లు కృష్ణానది నుంచి గత మంగళవారం రాత్రి ఇసుక అక్రమంగా తరలిస్తుండుగా స్థానిక ఎస్‌ఐ నవీద్ కాపుకాసి పట్టుకుని వాటిని సీజ్ చేసి స్టేషన్‌కు తరలించారు. ఇసుక రవా ణా చేస్తున్న ట్రాక్టర్ల యజమానులపై కేసునమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

‘నిలువురాళ్లు’ రెండో సంచిక అందజేత


తహసీల్దార్‌కు సంచికను అందిస్తున్న సీఆర్పీలు

నర్వ: జిల్లాలోని ప్రఖ్యాతిగాంచిన, దర్శనీయ స్థలాలు, జిల్లా విశిష్టతపై విద్యాశాఖ రూపొందించిన నిలువురాళ్లు రెండో సంచికను మండలంలో బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా విద్యాశాఖ సీఆర్పీలు నర్సింహులు, రోజాలు మండలంలోని వివిధ శాఖల అధికారులకు సంచికను అందజేసి వివరించారు. కలెక్టర్ సౌజన్యంతో రూపొందించిన ఈ సంచికను తహసీల్దార్ మల్లారెడ్డి, ఎంపీడీఓ సుదర్శన్, ఎస్ఐ కురుమయ్యలతో పాటు క్లస్టర్ సమావేశంలో ఆయా పాఠశాలల హెచ్‌ఎంలకు అందజేశారు. ఈ సంచికను రూపొందించిన విద్యాశాఖను ఆయా శాఖల అధికారులు అభినందించారు.

పార్టీ పటిష్టతకు కృషి : కాంగ్రెస్


కాంగ్రెస్‌లో చేరుతున్న వివిధ పార్టీల నాయకులు

ఊట్కూరు: కాంగ్రెస్ పార్టీ పటిష్టతకు కృషి చేద్దామని ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. బుధవారం ఊట్కూరులో బస్టాండ్ దగ్గర సీడబ్ల్యూసీ సభ్యుడు చల్లా వంశీచందర్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే కాంగ్రెస్ జెండాను ఎగరవేశారు. అనంతరం జరిగిన సమావేశంలో ఊట్కూరు మాజీ సర్పంచ్ సూర్యప్రకాశ్‌రెడ్డి, కొల్లూరు మాజీ సర్పంచ్ సరోజ, నాయకులు మోహన్, సుమారు 200 మంది బీఆర్‌ఎస్ కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరారు. వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ పేదల సంక్షేమానికి ఎన్నో పథకాలను ప్రవేశపెడుతుందని అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీలను తప్పక అమలు చేస్తుందన్నారు. అభివృద్ధిని చూసి ఇతర పార్టీల నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరడం ఎంతో సంతోషకరమని అన్నారు. కార్యక్రమంలో నాయకులు బాలకృష్ణారెడ్డి, కోల వెంకటేష్, యజ్ఞేశ్వర్‌రెడ్డి, దుర్గం శ్రీనివాస్, మహే శ్‌రెడ్డి, మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి


మాట్లాడుతున్న దత్తాత్రేయ

ఊట్కూరు: మండలంలోని చిన్నపొర్లలో బుధవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా లీగల్ ఏయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ దత్తాత్రేయ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరికీ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రతి ఒక్కరికి చట్టాలపై అవగాహన పెంచేందుకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ప్రతి గ్రామంలో న్యాయ విజ్ఞాన సదస్సులను నిర్వహిస్తుందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో న్యాయవాదులు రఘువీర్ యాదవ్, అగ్రికల్చర్ ఏఓ చరణ్, ఏఓ గణేష్‌రెడ్డి గ్రామ కార్యదర్శి లోకేష్, హెడ్‌కానిస్టేబుల్ సురేందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పుట్టిన రోజు కోసం ఎదురుచూపులు..



మరికల్: మండలంలోని తీలేర్‌కు చెందిన వెంకటేష్ – వెంకటేశ్వరమ్మ దంపతులకు 2020 ఫిబ్రవరి 29న అనుశ్రీ జన్మించింది. తమ కూతురు మొదటి జన్మదిన వేడుకలను నిర్వహించేందుకుగాను లీపు సంవత్సరం కోసం ఎదురుచూస్తున్నారు. నాలుగేళ్ల తర్వాత అనుశ్రీ జన్మదిన వేడుకలను నిర్వహించడం కొత్త అనుభూతి కలిగిస్తుందని చెప్పారు.

నాలుగేళ్ల పాటు గుర్తుండేలా..



ధన్వాడకు చెందిన బోయిన్‌పల్లి నర్సింహులు – లలిత దంపతులకు 2016 ఫిబ్రవరి 29న నందకిషోర్ జన్మించాడు. నాలుగేళ్ల పాటు అతడి జన్మదిన వేడుకలు గుర్తుండిపోయేలా నిర్వహిస్తూ వస్తున్నారు. రెండో జన్మదిన వేడుకలకు అన్ని ఏర్పాట్లుచేసినట్లు తెలిపారు.

వైభవంగా మహాపడిపూజ

మక్తల్: మండలంలోని శివ మహాపడిపూజ కార్యక్రమాన్ని బుధవారం శివస్వాములు ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు.. సామాన్‌పల్లిలో ఉదయం 7గంటలకు ఎల్లమ్మ ఆలయం నుంచి శ్రీ ఆంజనేయస్వామి ఆలయం వరకు పురవీధుల గుండా కలశంతో ఊరేగింపుగా వెళ్లారు. అనంతరం భక్తులు జ్యోతిర్లింగాలకు పూజలు చేశారు. వివిధ గ్రామాల నుంచి శివస్వాములు పాల్గొన్నారు.

మహాసభలను విజయవంతం చేద్దాం


వాల్‌పోస్టర్ విడుదల చేస్తున్న నాయకులు

నారాయణపేట రూరల్ : సీపీఐ (ఎంఎల్) మాస్లైన్ యూనిటీ ఆధ్వర్యంలో మార్చి 3నుంచి మూడు రోజుల పాటు నిర్వహిస్తున్న జాతీయ మహాసభలను విజయవంతం చేద్దామని ఆ పార్టీ నాయకులు భాస్కర్ అన్నారు. బుధవారం మండలంలోని తిర్మలాపూర్‌లో వాల్‌పోస్టర్లను విడుదల చేసి మాట్లాడారు.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ఎండగట్టడమే లక్ష్యంగా చర్చ జరుగుతుందని, దేశంలో జరుగుతున్న అకృత్యాలపై మాట్లాడుతారని చెప్పారు. అభివృద్ధి పేరుతో బడా వ్యాపారులను పెంచి పోషించడం, స్వార్థ ప్రయోజనాలకు అధికార పార్టీ నేతలు పనిచేయడంపై తీవ్రంగా విమర్శించారు. వెంకట్రాములు, హాజి మలాంగ్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ముంపు బాధితుల అకౌంట్‌లో డబ్బు జమ



మక్తల్: మండలంలోని సంగంబండ రిజర్వాయర్‌లో ముంపునకు గురైన బాధితుల అకౌంట్‌లో బుధవారం డబ్బు జమ అయ్యాయి. ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ప్రత్యేక చొరవతోనే డబ్బులు అందాయని బాధితులు హర్షం వ్యక్తం చేస్తూ మాజీ జెడ్పీటీసీ లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను కలిసి సన్మానించారు. 18 ఏళ్ల సమస్యను మూడు నెలల్లో పరిష్కరించి రూ.12కోట్లు బాధితులకు అందేలా చొరవ చూపారని హర్షం వ్యక్తం చేశారు. నర్సింహారెడ్డి, చెన్నరెడ్డి, గజలప్ప, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా స్వయం పాలన దినోత్సవం


మక్తల్‌లో విద్యార్థులతో ఉపాధ్యాయులు

కోస్గి: గుండుమాల్ జెడ్పీ ఉన్నత పాఠశాల, కడంపల్లిలోని ప్రాథమిక పాఠశాలలో బుధవారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. అలాగే కడంపల్లి పాఠశాల విద్యార్థులు స్వయం పాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం చక్కగా బోధించిన విద్యార్థులకు ఉపాధ్యాయులు బహుమతులను అందజేశారు. హెచ్‌ఎంలు భానుప్రకాష్ రెడ్డి, నరహరిచారి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

మక్తల్: మండలంలోని సంగంబండ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులు బుధవారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. అనంతరం చక్కగా బోధించిన వారికి ఉపాధ్యాయులు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అలంపల్లి వెంకటేష్, వెంకట్‌రాములు, పరమేశ్వరీ పాల్గొన్నారు.

మరికల్: మండల కేంద్రంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన విద్యార్థులు బుధవారం ఘనంగా స్వయంపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం ఉపాధ్యాయ వృతిలో చక్కగా అభినయం చేసిన విద్యార్థులను పాఠశాల డైరెక్టర్ తిరుపతయ్య, కరస్పాండెంట్ మల్లేష్, ప్రిన్సిపాల్ రఘుజీవన్ ఉపాధ్యాయ బృందం అభినందించారు.

108లో ప్రసవం.. తల్లీబిడ్డ క్షేమం

మద్దూరు: స్థానిక ఆస్పత్రికి కాన్పు నిమిత్తం వచ్చిన గర్భిణి ఇక్కడ సరైన సౌకర్యాలు లేవని పేట జిల్లా ఆస్పత్రికి తీసుకెళ్లాలని సూచించడంతో 108వాహనంలో తరలిస్తున్న క్రమంలో నొప్పులు రావడంతో 108 సిబ్బంది సుఖ ప్రసవ చేశారు. వివరాల్లోకి వెళ్తే.. కొత్తపల్లి తాండాకు చెందిన వెంకటబాయి ప్రసవం కోసం స్థానిక సీహెచ్‌సీ సెంటర్‌కు మంగళవారం తీసుకొచ్చారు. ఇక్కడున్న సిబ్బంది సుఖ ప్రసవానికి ప్రయత్నించారు. ప్రసవం కాకపోవడంతో జిల్లా ఆస్పత్రికి తీసుకెళ్లాలని సూచించడంతో రాత్రి 1గంటల సమయంలో 108 ద్వారా ఆస్పత్రికి తరలించే క్రమంలో నొప్పులు తీవ్రం కావడంతో అంబులెన్స్ టెక్నిషియన్ ఎల్లమ్మ, కుటుంబ సభ్యుల సహకారంతో వైద్యం చేయడంతో మగబిడ్డకు జన్మనిచ్చింది. అనంతరం వెంటనే జిల్లా ఆస్పత్రికి తీసుకెళ్లగా వైద్యులు పరీక్షించి తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారని తెలిపారు.